పని చేయని అధికారులపై ఫిర్యాదులు చేస్తాం

- కోడ్‌ను సాకుగా చూపి అధికారులు తప్పించుకుంటున్నారు
- ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్


మజ్లిస్ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: పని చేయని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తామని కార్వాన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారంగా టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో పలువురు నాయకులతో ఆయన సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజల నుంచి తనకు నిత్యం ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తాను ప్రజలను కలవడం, బస్తీలలో పర్యటించడం లాంటివి చేయడం లేదన్నారు. దీనిని సాకుగా తీసుకొని అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదన్నారు. వీధి లైట్లు వెలగడం లేదని, నల్లాల్లో మురికి నీరు వస్తుందని తనకు నిత్యం ఫోన్‌లో ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన అన్నారు. సమస్యలను పరిష్కరించాలంటూ తాను సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్నానని అయితే అధికారులు మాత్రం స్పందించడం లేదని ఆయన పేర్కొన్నారు. కార్వాన్, లంగర్‌హౌజ్, టోలిచౌకీ తదితర డివిజన్‌లలో ఒక హైమాస్క్ లైట్లు కూడా వెలగడం లేదని బల్దియా వీధిలైట్ల విభాగం వారు నిద్రమత్తులో ఉన్నారా అనే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. మజ్లిస్‌కు చెందిన డివిజన్, ఏరియా కమిటీ సభ్యులు తమతమ ప్రాంతాల్లోని సమస్యలను తనకు లిఖితపూర్వకంగా ఇవ్వాలని ఆయన కోరారు. సమస్యల చిట్టాతో తాను బల్దియా జలమండలి, విద్యుత్ శాఖ అధికారులను కలిసి వారిని సమస్యలపై నిలదీస్తానని ఆయన స్పష్టం చేశారు. రోడ్లు అధ్వానంగా తయారైయ్యాయని ఎన్నికల కోడ్ అమలుకు ముందు ప్రారంభమైన పనులకు ఎన్నికల కోడ్ అడ్డంకి కానేకాదని అయితే అధికారులు మాత్రం పనులు నిలిపివేశారన్నారు. తాగునీటి సరఫరా సవ్యంగా జరగడం లేదన్న విషయంపై కూడా తనకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎన్నికల కోడ్ ముగియగానే తాను కార్వాన్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్, జుబేర్‌బిన్ అవద్, వజీఉజ్‌జమా సిద్ధిఖి తదితరులున్నారు.

నూతన కన్వీనర్ పండరీనాథ్‌కు సన్మానం


పండరీనాథ్‌ను సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చాంద్రాయణగుట్ట: భారతీయ జనతా పార్టీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్‌గా నియమితులైన ఎడ్ల పండరీనాథ్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఉప్పుగూడలో బుధవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఎం.నర్సింహస్వామి, చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి ముక్కెర రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీలో పండరీనాథ్ బూత్‌స్థాయి నుంచి పని చేస్తూ నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమితులవ్వడం అభినందనీయమన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిన ఆయన ముమ్ముందు మరిన్ని పదవులు అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాలిగం చిరంజీవి, కొడీ మహేందర్, బర్ల శ్రీనివాస్, పొన్న శ్రీనివాసారావు, మహేందర్ రెడ్డి, ప్రకాష్, ప్రభు, మధుకర్, రూపేష్, మధుసూదన్, లలిత, వేణు, శ్రీధర్, సంతోష్ పాల్గొన్నారు.

దక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీ వెంటనే మూసివేయాలి


మాట్లాడుతున్న డాక్టర్ సీహెచ్ భద్ర తదితరులు

సుల్తాన్‌బజార్: హుజుర్‌నగర్ నియోజకవర్గంలో పాలకీడు మండలం మహంకాళి గూడెం గ్రామ శివారు ఫారెస్టులో ఏ మాత్రం అనుమతులు లేకుండా నడుపుతున్న డెక్కన్ సిమెంట్ ఫ్యాక్టరీని వెంటనే మూసివేయాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సీహెచ్ భద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ హరిత ట్రిబ్యునల్ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ గత పాలకుల అండతో అధికారులు పూర్తిగా అవినీతిపరులకు వత్తాసు పలుకుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పోరాడుతున్న పసుపులేటి సురేష్‌ను చంపడానికి అనేక రకాల కుట్రలు పన్నారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణ కోసం ముందు వరుసలో ఉంటానని అందుకోసం ప్రకృతి నా పరిపాలన సహకరిస్తుందని అనేక సందర్భాలలో ప్రకటించారని గుర్తు చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి ఇప్పటివరకు డెక్కన్ సిమెంట్ సంస్థ చేసిన దోపిడీ, అక్రమాలు అన్యాయాల మీద సమగ్ర విచారణ జరిపించాలన్నారు. వేల కోట్ల రూపాయలు సంపాదిస్తూ పర్యావరణ ఉద్యమకారులను చంపేయాని చూస్తున్నారన్నారు. ఈ అవినీతికి సహకరించిన అధికారులను అరెస్టు చేసి వారి ఆస్తులు జప్తు చేయాలన్నారు. ఈ సమావేశంలో పర్యావరణ ఉద్యమకారుడు పసుపులేటి సురేష్‌బాబు, ప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్‌సాయి, ట్రెజరర్ కేంద్ర ప్రభుత్వ ఆహార పంపిణీ సలహా మండలి సభ్యులు రిజ్వాన్ అహ్మద్, ఉపాధ్యక్షులు ప్రశాంత్, సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్ పాల్గొన్నారు.

సమాజ సేవ ప్రతి ఒక్కరి బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: సమాజ సేవ చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో ఆర్గనైజేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముమ్ముందు చేపట్టబోయే సమాజ సేవ కార్యక్రమాలు, ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి సన్మానించడం తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గనైజేషన్ తరఫున తాము చేపడుతున్న కార్యక్రమాలకు అన్ని వర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమను ప్రోత్సహిస్తున్నారని ఆయన అన్నారు. ప్రజల ప్రోత్సహంతో మరింత బాధ్యతతో సేవా కార్యక్రమాలు నిర్వహించే విధంగా దిశానిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. ఈ సంవత్సరం పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సహకాలు ఇస్తామని ఆయన తెలిపారు. అదే విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించిన ప్రిన్సిపాల్స్‌ను కూడా సన్మానిస్తామని ఆయన పేర్కొన్నారు. కొంతకాలంగా ఎన్నికల కారణంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం లేదని అయితే వచ్చే నెల నుంచి గతంలో మాదిరిగానే సేవా కార్యక్రమాలను యథావిధంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఇస్మాయిల్ సిద్ధిఖి, ఖాలేద్ ఆలీఖాన్ తదితరులున్నారు.

ఖడ్గ మృగాల కోసం నైట్ ఎన్‌క్లోజర్ నిర్మాణం


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విభాగాధిపతి, జూ పార్క్ క్యూరేటర్‌లు

బహదూర్‌పురా: నెహ్రూ జూలాజికల్ పార్కులో రైనోల కోసం నైట్ ఎన్‌క్లోజర్ నిర్మించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంస్థ ముందుకు వచ్చింది. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో గురువారం ఖడ్గమృగాల నైట్ ఎన్‌క్లోజర్ పనులను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్, స్టేట్ హెడ్ బి.అనిల్‌కుమార్, డీజీఎం వి.కుమార్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ అధికారులు డాక్టర్ సునిల్, ఎస్. హిరేమత్, ఐఎఫ్ఎస్, డైరెక్టర్ (ఎఫ్ఏసీ), క్యూరేటర్, ఎ.నాగమణి డిప్యూటీ క్యూరేటర్, డాక్టర్ ఎంఏ. హకీం, డిప్యూటీ డైరెక్టర్, (వైట్), ఎ.సతీష్‌బాబు, అసిస్టెంట్ క్యూరేటర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నెహ్రూ జులాజికల్ పార్క్ హైదరాబాద్‌తో చేతులు కలపడంతోపాటు ఖడ్గ మృగాల సంరక్షణలో ప్రత్యేకంగా వన్యప్రాణుల సంరక్షణలో భాగం కావడం గర్వంగా ఉందన్నారు. నెహ్రూ జులాజికల్ పార్క్‌లోని 5 ఖడ్గమృగాలను దత్తత తీసుకోవడంతో వాటికి ఉన్న సౌకర్యాన్ని మెరుగుపరచడానికి గురువారం కొత్త నైట్ హౌస్ నిర్మాణ పనులు ప్రారంభించామని దీని అంచనా వ్యయం రూ.35 లక్షలు ఉంటుందన్నారు. కాగా నెహ్రూ జూలాజికల్ పార్కులో సూరజ్, సరస్వతి, సాయి విజయ్, నంద, ప్రేమ అనే ఐదు ఖడ్గ మృగాలు ఉన్నాయి. ఒక కొమ్ము ఖడ్గమృగం (3 మగ, 2 ఆడ)వి ఉన్నాయి.

యుద్ధ ప్రాతిపదికన నాలాల్లో పేరుకున్న వ్యర్థాల తొలగింపు

- ప్రధాన నాలాలపై ఉన్నతాధికారుల సమీక్ష
- క్షేత్రస్థాయి నివేదికల కోసం సర్కిల్–12 అధికారుల కసరత్తు


బల్కాపూర్ నాలాను పరిశీలిస్తున్న సర్కిల్–12 డీసీ సీహెచ్.నాగేశ్వర్, ఈఈ లాల్‌సింగ్

నాంపల్లి: వర్షాకాలానికి ముందే మురుగునీటి నాలాలపై జీహెచ్ఎంసీ అధికారులు దృష్టిసారించారు. ప్రధాన నాలాల్లో పేరుకున్న వ్యర్థాలను తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉన్నతస్థాయి అధికారుల ఆదేశాలతో సర్కిల్–12 అధికారులు ఆదిశగా పనులు చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. ఇందులో భాగంగానే గురువారం డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లాల్‌సింగ్ నియోజకవర్గంలోని పలు మురికినీటి నాలాలను పరిశీలించారు. అహ్మద్‌నగర్‌లోని బల్కాపూర్‌నాలా, మల్లేపల్లిలోని అఫ్జల్‌సాగర్ నాలాలను తనిఖీ చేశారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని క్రేన్ల సహాయంతో, కూలీలతో తొలగించాలనే నిర్ణయానికి వచ్చారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసి తగు ప్రతిపాదనలను జోనల్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపడానికి సన్నద్ధం అయ్యారు. ఈ పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ కూడా మరో రెండు రోజుల్లో పూర్తి కానున్నట్లు తెలిసింది.

ప్రజల సహకారం ఎంతో అవసరం...

ప్రతి ఏటా నాలాల్లోని వ్యర్థాలను ఎత్తిపోస్తున్నప్పటికి మళ్ళీ మళ్ళీ చెత్తాచెదారంతో నిండిపోతోంది. నిండిపోయిన చెత్తను తొలగించడానికి వేసవిలో పూడికతీత పనులు చేపట్టాల్సి వస్తోంది. మురికినీటి నాలాలకు కంచెను వేసినా సమీపంలో ఉండే ఆయా బస్తీల ప్రజలు ప్లాస్టిక్ కవర్లు, వాటర్ బాటిల్స్‌ను అధికంగా నాలాల్లో వేస్తున్నారు. అలాగే స్థానికంగా పాల దిగుబడి కోసం కొందరు గేదెలను నాలాల సమీపంలో పెంచిపోషిస్తున్నారు. వీటి నుంచి వచ్చే వ్యర్థాలు సైతం మురికినీటి నాలాల్లోకి మళ్లిస్తున్నారు. ఫలితంగా మురికినీటి నాలాల్లో కుప్పలు కుప్పలుగా వ్యర్థాలు పోగవుతున్నాయి. అంతేకాకుండా పలు హోటల్స్‌కు చెందిన వ్యర్థాలు, జంతువుల నుంచి వచ్చే వ్యర్థాలను నాలాల్లో పారబోస్తుండటంతో మురుగు ప్రవాహం దిగువకు ప్రయాణించాలంటే అతి కష్టంగా మారుతుందని పేర్కొన్నారు. ఇకనైనా వ్యర్థాలు మురికినీటి నాలాల్లో కాకుండా చెత్త కుండీలలో వేస్తూ జీహెచ్ఎంసీకి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

రెండు ప్రధాన నాలాలపై దృష్టి...

నాంపల్లి నియోజకవర్గంలో ఎక్కువ దూరం ప్రయాణించే నాలాల్లో ప్రధానమైన బల్కాపూర్ నాలా, అఫ్జల్‌సాగర్ నాలా ఉన్నాయి. బల్కాపూర్ నాలా నియోజకవర్గంలో 1.70 కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తూ హుస్సేన్‌సాగర్‌లో కలుస్తోంది. ఎగువ ప్రాంతాలైన జూబ్లీహిల్స్ ప్రాంతం నుంచి ప్రారంభమై అహ్మద్‌నగర్, ఫస్టలాన్సర్, చింతలబస్తీ, ఖైరతాబాదు మీదుగా ప్రవహించి హుస్సేన్‌సాగర్‌లో కలుస్తోంది. అలాగే మాసబ్‌ట్యాంక్ ప్రాంతం నుంచి ప్రారంభమయ్యే మరో నాలా విజయనగర్ కాలనీ, మల్లేపల్లి మీదుగా ప్రవహించే అఫ్జల్‌సాగర్ నాలా మూసీనదిలో కలుస్తోంది. ఈ మురికినీటి నాలా నియోజకవర్గంలో సుమారు రెండు కిలో మీటర్ల మేర ప్రయాణిస్తూ మురికినీటిని తీసుకెళ్తుంది. వీటికి తోడు ఏసీగార్డ్, రెడ్‌హిల్స్ ప్రాంతాలను కలుపుతూ నాంపల్లి రైల్వే స్టేషన్ మీదుగా ప్రవహించే అండాలమ్మ బస్తీ నాలా గాంధీభవన్ దగ్గర మాలకుంట నాలాలో కలుస్తుండగా, ఇవే కాకుండా చిన్నచిన్న నాలాలు అనేకం ఉన్నాయి. ఇప్పటికే కొన్ని కనుమరుగు కాగా మరికొన్ని అన్యాక్రాంతం అయ్యాయి. వీటిని కూడా క్షేత్రస్థాయిలో గుర్తించి విస్తరణ చేసే పనిలో జీహెచ్ఎంసీ అధికారులు ఉన్నారు.

రేపు ఈఎంఆర్ఐ సంస్థలో ఇంటర్వ్యూలు

గౌలిపురా: ఈఎంఆర్ఐ (108) సంస్థలో పైలెట్ (డ్రైవర్) ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రొగ్రామ్ మేనేజర్ షేక్ జన్‌షాహీద్ తెలిపారు. జూన్ 1వ తేదీన కోఠి రీజినల్ కార్యాలయంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరు కావాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్ వెంట తీసుకొని ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. పదో తరగతి పాస్ అయి 23–35 ఏళ్ల వయస్సు ఉండి... ఎల్ఎంవీ (బాడ్జి) కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 9000001674 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆపరేషన్ 'అమానత్' కింద రూ.14,19,270 సొత్తు రికవరీ

నాంపల్లి: రైళ్లలో ప్రయాణిస్తూ రైలు బోగీల్లో మరిచిపోయిన లగేజీలను అమానత్ పథకం కింద ప్రయాణికులకు ఎప్పటికప్పుడు అప్పగిస్తున్నట్లు హైదరాబాద్ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కల్పన పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం అమానత్ పథకం కింద లగేజీ పోగొట్టుకున్న బాధితులకు లగేజీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడచిన ఐదు నెలల కాలంలో జరిగిన 107 సంఘటనల్లో రూ.14,19,270 విలువైన వస్తువులను రికవరీ చేసినట్లు తెలిపారు. ఆపరేషన్ అమానత్ పథకం కింద ప్రయాణికులకు రైళ్లలో పోగొట్టుకున్న వస్తువులను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇది చాలా మంచి సంకల్పాన్ని తెస్తుందని, ప్రయాణికులలో విశ్వాసాన్ని పెంచుతుందని తెలిపారు. అలాగే ఈ ఆపరేషన్ విధి నిర్వహణలో భాగంగా ఆర్‌పీఎఫ్ సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో పాటుగా ప్రయాణికులకు సురక్షితమైన వాతావరణాన్ని అందజేయడానికి ఆర్‌పీఎఫ్ పనిచేస్తోందన్నారు.

విధులకు ఆటంకం కలిగించినందుకు...

వ్యక్తికి ఐదు రోజులు జైలు, రూ. 1050 జరిమానా


మహ్మద్ మహబూబ్

గౌలిపురా: అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన ఓ వ్యక్తికి నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మేజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి ఐదు రోజుల జైలు శిక్షతోపాటు రూ.1050 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం... తలాబ్‌కట్టా భవానీనగర్ ప్రాంతానికి చెందిన ఎలక్ట్రిషియన్ మహ్మద్ మహబూబ్ (35) గురువారం భవానీనగర్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు విచారించగా వారికి సహకరించకుండా వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో మహబూబ్‌ను అరెస్ట్ చేసి ఈ–పెట్టి కేసు నమోదు చేసుకొని గురువారం నాంపల్లిలోని 4వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు కేసు విచారించిన మేజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి మహబూబ్‌కు ఐదు రోజుల జైలు శిక్షతో పాటు రూ.1050 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి


సురవరం కుమారుడు కృష్ణవర్ధన్‌ను సన్మానిస్తున్న పలువురు ప్రముఖులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాప్‌రెడ్డి అని పలువురు వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగుభాష చైతన సమితి, గోల్కొండ కళా సమితి, కుసుమ ధర్మన్న కళాపీఠంల ఆధ్వర్యంలో సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి మాట్లాడుతూ సురవరం ప్రతాప్‌రెడ్డి రచనలు ఎంతో ప్రభావితం చేశాయని గుర్తుచేశారు. అనంతరం సురవరం ప్రతాప్‌రెడ్డి కుమారుడు కృష్ణవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఓయూ విశ్రాంత ఆచార్యలు కసిరెడ్డి వెంకటరెడ్డి, మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ పాలడుగు సరోజిని దేవి, గోల్కొండ కళాసాహితీ కళాసమితి అధ్యక్షులు ప్రకాష్‌రెడ్డి, తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే దైవానుగ్రహం


ఓ బాలుడికి బహుమతి అందిస్తున్న సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ

గోల్కొండ: ఆధ్యాత్మిక చింతనతోనే దైవానుగ్రహం కలుగుతుందని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు, మదర్సా రహమతుల్ హులూమ్ వ్యవస్థాపకులు ఖారీ సయ్యద్ మతీన్ ఆలీషా ఖాద్రీ అన్నారు. గురువారం గోల్కొండ రిసాల బజార్‌లోని మదర్సా రహమతుల్ హులూమ్‌లో ఖురాన్ గ్రంథాన్ని కంఠస్తం చేసిన వారికి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మదర్సా బాలురకు బహుమతులు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖురాన్ గ్రంథ పఠనం చేసిన వారు విజయ బాటలో పయనిస్తారని పరమాత్ముడి అండదండలతో వారు తమ జీవితంలో విజయాలు సాధిస్తారని ఆయన అన్నారు. కురాన్ గ్రంథంలో నైతిక విలువలే కాకుండా శాస్త్ర, సాంకేతిక విషయాలు ఎన్నో ఉన్నాయని ప్రళయం జరిగే రోజు ఏం జరుగుతుందో అన్న విషయాలు కూడా ఖురాన్‌లో స్పష్టంగా ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులు, గురువులను గౌరవించడమే కాకుండా వారిని తమకు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మదర్సాలలో చదివే విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన పౌరులుగా ఎదుగుతారని ఆయన అన్నారు. ఇటువంటి వారు దేశ సేవలో ఎప్పుడు ముందుంటారని ఆయన అన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు


ఎంకే.రాముకు అవార్డును అందజేస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఎన్టీ రామారావు జీవితం కేవలం సినీ రంగానికి పరిమితం కాదని అప్పటి రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొచ్చారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సౌజన్యంతో సృజన భారతి ఆధ్వర్యంలో పద్మశ్రీ ఎన్టీ రామారావు 101 వ జయంతి వేడుకలను గురువారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీ.రమణాచారి మాట్లాడుతూ ఎన్టీ రామారావును నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రముఖ కవి ఎంకే.రాముకు ఎన్టీఆర్ అవార్డును ప్రదానం చేశారు. అంతకు ముందు శ్యామల మాస పత్రికను ఆవిష్కరించగా సంగీత నృత్య రూపకాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇన్‌కమ్‌ట్యాక్స్ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నర్సింహప్ప, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, సినీ నటుడు నాగబాల సురేష్‌కుమార్, తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొమ్మూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీకి గుణపాఠం తప్పదు


అజ్మీర్ దర్గాలో దట్టీ సమర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుడు అఫ్సర్ యూసుఫ్ జాహీ

గోల్కొండ: కులాలు, వర్గాల మధ్య చిచ్చుపెట్టడమే కాక ప్రజల హక్కులను కాలరాయాలని చూస్తున్న ప్రధాని మోదీకి ఈ ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అఫ్సర్ యూసుఫ్ జాహీ అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావాలని కోరుతూ అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ఆయన గురువారం అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దట్టీ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పదేళ్ల రాష్ట్రాన్ని పాలించి ప్రజాధనాన్ని దోచుకున్న బీఆర్ఎస్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు. అదే విధంగా పదేళ్ల దేశాన్ని పాలించిన ప్రధాని నరేంద్రమోదీకి ఓటమి తప్పదని ఆయన అన్నారు. కులాలు, వర్గాల మధ్య చిచ్చుపెట్టి ఓ వర్గం ప్రజల హక్కులను కాలరాస్తు ప్రధాని మోదీ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పార్లమెంట్ అభ్యర్థి దానం నాగేందర్ గెలవాలంటూ కూడా తాను ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

నల్లపోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


నల్లపోచమ్మ ఆలయంలో ఎస్.జనార్దన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: లంగర్‌హౌజ్‌లోని శ్రీ నల్లపోచమ్మ తల్లికి గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ 11వ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు సోమారపు జనార్దన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లంగర్‌హౌజ్ మాజీ కార్పొరేటర్ సి.ఉదయ్‌కుమార్, బీజేపీ నాయకుడు ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

గాంధీభవన్‌లో అన్నదానం


గాంధీభవన్‌లో అన్నదానం చేస్తున్న సంతోష్‌రెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్ బాబు జన్మదినోత్సవ వేడుకలను యువజన కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీ మామిడాల సంతోష్ ఆధ్వర్యంలో గురువారం గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. కోఠి మెటర్నటి, గాంధీ, బసవతారక ఆసుపత్రులలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు గాంధీభవన్‌లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి శ్రీధర్‌బాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రెండురోజుల పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం, వీధి వ్యాపారులకు గొడుగుల పంపిణీ చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కోలుకోవాలని పూజలు


పూజలు నిర్వహిస్తున్న పులికంటి నరేష్

చాంద్రాయణగుట్ట: గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న జంగమ్మెట్ డివిజన్ కార్పొరేటర్ ఎం.ఎ.రహమాన్ త్వరగా కోలుకోవాలని కోరుతూ ఎస్సీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు పులికంటి నరేష్ గురువారం కందికల్ చిత్రగుప్త స్వామి దేవాలయ ఆవరణలోని ఉమా మహేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. త్వరగా ఆయన ఆరోగ్యం కుదుటపడి త్వరితంగా ప్రజా సేవలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సునిల్, సాయి, శేఖర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ కళలను భవిష్యత్ తరాలకు అందిద్దాం

గన్‌ఫౌండ్రీ: శాస్త్రీయ సంగీత నృత్య రూపకాలను భావితరాలకు అందించాలని భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. గురువారం శ్రీలక్ష్మీ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ 5వ వార్షికోత్సవ వేడుకలను రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన చిన్నారులు వివిధ అంశాలపై ప్రదర్శించిన నృత్య రూపకాలు ఆహూతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ శాస్త్రీయ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించాలని ఆయన కోరారు. అనంతరం పలువురు నృత్య గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లహరి శ్రీ నృత్య నికేతన్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ పి.రూన్సీరామ్, సినీ నిర్మాత అనూహ్యారెడ్డి, చినుకు వ్యవస్థాపకులు పీఎస్.మూర్తి అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి, సంస్థ అధ్యక్షురాలు అనుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ చిహ్నాన్ని తొలగించడం సరికాదు


కార్యక్రమంలో పాల్గొన్న ఆశీష్‌కుమార్ యాదవ్ తదితరులు

అబిడ్స్: తెలంగాణ అనగానే హైదరాబాద్‌లోని చార్మినార్ గుర్తిస్తాయని అలాంటి తెలంగాణ రాజముద్రలో చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలని నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం చార్మినార్ వద్ద నిర్వహించిన కేటీఆర్ సమావేశంలో ఆయన గోషామహల్ నుంచి భారీ ఎత్తున కార్యకర్తలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆశీష్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ చార్మినార్‌ను రాజముద్ర నుంచి తొలగించడమంటే ప్రతీ హైదరాబాదీని అవమానపరిచినట్టే ఆయన అన్నారు. ప్రతీ ఒక్కరిని అగౌరవపరిచినట్టే అని పేర్కొన్నారు. తెలంగాణ వారసత్వ సంపద, సాంస్కృతికి గుర్తులుగా ఉన్న చార్మినార్, కాకతీయ కళాతోరణాన్ని రాజముద్ర నుంచి తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్‌కు నివాళి



చార్మినార్: ప్రముఖ క్లాసికల్ సంగీత విద్యాంసుడు బిస్మిల్లా ఖాన్ సంగీత ప్రపంచానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. వారణాసికి చెందిన ప్రముఖ హిందుస్థానీ క్లాసికల్ సంగీత విద్వాంసుడు, భారత రత్న ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ ఇంటికి ఈటల రాజేందర్‌తోపాటు బీజేపీ తెలంగాణ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తదితరుల బృందం గురువారం వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బిస్మిల్లా ఖాన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్నికల ప్రచారం ముగింపు అనంతరం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నివాళులర్పించినట్లు వారు తెలిపారు.

కార్మికుల హక్కుల రక్షణలో సీఐటీయూ పాత్ర కీలకం



చాంద్రాయణగుట్ట: కార్మిక హక్కుల రక్షణలో సీఐటీయూ పాత్ర కీలకమని చాంద్రాయణగుట్ట ఇన్‌చార్జి ఎస్.కిషన్ అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చాంద్రాయణగుట్టలో గురువారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ కార్మిక సంఘాలను ఐక్యం చేయడంలో సీఐటీయూ పాత్ర ఎంతో కీలకమన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యిందన్నారు. కార్మికుల శ్రమను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతుందని విమర్శించారు. అనేక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసిందన్నారు. భవిష్యత్తులో సీఐటీయూ స్ఫూర్తితో కార్మికుల పక్షాన ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోటయ్య, రాంకుమార్, కృష్ణా నాయక్ తదితరులు పాల్గొన్నారు.